క్లుప్తంగా

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి 8 గంటల వరకు జరుగుతుంది. ఈ సందర్భంగా 'ది బెస్ట్ ఈజ్ యెట్ టు కమ్' అనే అంశంపై సేఠ్ మెడికల్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ యజమాని, ప్రొఫెషనల్ పీడియాట్రిషియన్ డాక్టర్ వాలెంటీనా సేఠ్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించాలి.

నేటినుంచి బౌల్డర్‌హిల్స్‌లో ఆటోక్రాస్ చాంపియన్‌షిప్

- ఆపరేషన్ థియేటర్ కోసం నిధుల సేకరణ

రాయదుర్గం: పుట్టుకతో గుండె జబ్బులున్న పిల్లలకు సాయం చేయడానికి ఆపరేషన్ థియేటర్ ఏర్పాటుకు నిధుల సేకరణకు ఆటోక్రాస్ చాంపియన్‌షిప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ తొలిసారిగా ఇండియన్ నేషనల్ ఆటోక్రాస్ చాంపియన్‌షిప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. గచ్చిబౌలిలోని బౌల్డర్‌హిల్స్ గోల్ఫ్ కోర్సులోని కస్టమ్–బిల్ట్ రేస్ ట్రాక్‌లో శుక్ర, శని, ఆదివారాల్లో ఈ చాంపియన్‌షిప్ నిర్వహిస్తారు. సిద్ధిపేటలోని సత్యసాయి ఆస్పత్రిలో గుండె ఆపరేషన్ల నిర్వహణకు రూ.7.5 కోట్ల వ్యయం అవుతుందని మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు అనుపమ్‌రాజ్, విష్ణు ఉపాధ్యాయ వివరించారు. ఔత్సాహిక పోటీదారులు తమ సాధారణ కార్లతో కూడా ఈ పోటీలో పాల్గొనవచ్చని వారు స్పష్టం చేశారు.

కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు


చందానగర్ లేబర్ అడ్డా వద్ద ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న కార్మికులు

మియాపూర్ : చందానగర్‌లోని లేబర్ అడ్డా వద్ద సీఐటీయూ, లేబర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ, రక్తపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సీఐటీయూ కార్యదర్శి కొంగరి కృష్ణ, కార్మిక నాయకుడు మహేష్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

నగరవాసికి బెస్ట్ గార్మెంట్ కన్‌స్ట్రక్షన్ అవార్డ్

సాక్షి, సిటీబ్యూరో: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్), ఉషా ఇంటర్నేషనల్‌తో కలిసి అందించే ఉషా నిఫ్ట్ 'బెస్ట్ గార్మెంట్ కన్‌స్ట్రక్షన్ అవార్డుకు నగరవాసి ప్రియా జిందాల్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ ప్రతినిధులు తెలిపారు. మాదాపూర్‌లోని నిఫ్ట్ ఆవరణలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రియా జిందాల్‌కు పురస్కారంతో పాటు నగదు, బహుమతులు అందించారు.

బిగ్‌బాస్కెట్ డెలివరీ బాయ్ ఆత్మహత్య

గచ్చిబౌలి: కిరాణ సరుకులు చేరవేసే బిగ్ బాస్కెట్ డెలివరీ బాయ్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సురేష్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిషాకు చెందిన ఎల్.హరీష్(26) మూసాపేట్‌లో నివాసం ఉంటూ మూడేళ్లుగా బిగ్ బాస్కెట్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం 6 గంటలకు సరుకులు డెలివరీ చేసేందుకు సహ ఉద్యోగి రాజేష్‌తో కలిసి మసీద్‌బండలోని సీఎంసీ ఎన్‌క్లేవ్‌లోని ఆర్‌వీ పంచజన్య అపార్ట్‌మెంట్‌లోని వివిధ ఫ్లాట్లకు వెళ్లారు. సరుకులు డెలివరీ చేసిన అనంతరం రాజేష్ రాలేదు. అక్కడి సెక్యూరిటీకి సమాచారం అందించగా బీ–1లో ఫైర్ సేఫ్టీ పైపులకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా మూడున్నర లక్షలు అప్పుగా తీసుకున్న వ్యక్తి తిరిగి ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.

డ్యూటీకి వెళ్లి...

పటాన్‌చెరు టౌన్: డ్యూటీకి వెళ్లిన తన భర్త తిరిగి రాలేదంటూ భార్య ఫిర్యాదు చేసింది. భానూర్–బీడీఎల్ ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామ పరిధిలోని బాలాజీ హోమ్స్‌కు చెందిన సతీష్ పాశమైలారం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు.రోజు మాదిరిగానే మే 30వ తేదీన సతీష్ రాత్రి డ్యూటీకి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. భార్య శ్రీదేవి ఫోన్ చేయగా కొంచెం పనిఉందని పూర్తి చేసుకొని వస్తానని చెప్పాడు. తిరిగి సాయంత్రం నాలుగు గంటలకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో భార్య శ్రీదేవి, కుటుంబ సభ్యులు కలసి పరిశ్రమకు వద్దకు వెళ్లి అడగగా డ్యూటీ దిగి వెళ్లాడన్నారు. భర్త సతీష్ కోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శ్రీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఎఫ్‌ఓబీ..

- రాయదుర్గం మల్కంచెరువు వద్ద సిద్ధమవుతున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి
- రూ.3.50 కోట్ల వ్యయంతో నిర్మాణం గచ్చిబౌలి డివిజన్‌లో ఇది మూడోది..


రాయదుర్గం మల్కంచెరువు వద్ద నిర్మాణ దశలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి

రాయదుర్గం: పాదచారులు ఇకపై సులభంగా రోడ్డు దాటొచ్చు. రాయదుర్గం మల్కంచెరువు వద్ద అత్యాధునిక సౌకర్యాలతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి రానుంది.ఇది అందుబాటులోకి వస్తే మల్కంచెరువు పరిసరాలు, చిత్రపురి కాలనీ, టింబర్ లేక్ కాలనీవాసులు, అక్కడ ఉన్న ఆస్పత్రులకు వచ్చే వారికి ఎంతో మేలు. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల ఆదేశంపై శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి పర్యవేక్షణలో ఏఈ జగదీష్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ బ్రిడ్జి పనులు సాగుతున్నాయి.

- గచ్చిబౌలి డివిజన్‌లో ఇప్పటికే రెండు ఎఫ్‌ఓబీలు అందుబాటులో ఉండగా మూడవది రాయదుర్గం మల్కంచెరువు సమీపంలో నిర్మిస్తున్నారు.
- మొదటిది టీఎస్‌ఐఐసీ ఆధ్వర్యంలో ఐఎస్‌బీ–ఇన్ఫోసిస్ ముందున్న రోడ్డుపై సింగపూర్ మోడల్‌లో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన బ్రిడ్జి అందుబాటులో ఉంది.
- అలాగే రాయదుర్గం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఓరియన్ కాంప్లెక్స్ వద్ద అందులోబాటులోకి తీసుకొచ్చారు.
- కాగా మూడవది పాతముంబాయి రహదారిపై రాయదుర్గం మల్కంచెరువు వద్ద సిద్ధమవుతోంది.
- జీహెచ్ఎంసీ రూ.3.50 కోట్ల వ్యయంతోఈ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టింది
- రాయదుర్గం మల్కంచెరువుకు వాకింగ్‌కోసం వచ్చేవారే కాకుండా, టింబర్ లేక్ కాలనీ, చిత్రపురికాలనీ, ప్రధానరోడ్డు పరిసరాల్లోని వివిధ విద్య, వైద్య, ఇతర సంస్థలకు రాకపోకలు సులువవుతాయి.

కొన్ని ప్రతిపాదనలకే పరిమితం

- ఇక అభివృద్ధి పనుల్లో భాగంగా ట్రిపుల్‌ఐటీ కూడలిలో స్కైవాక్‌ను ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు తలపెట్టారు. కానీ ఇది ప్రతిపాదనలకే పరిమితమైంది
- టీఎస్‌ఐఐసీ ఆధ్వర్యంలో విప్రో కూడలిలో ఫోర్ వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని తలపెట్టారు. అధికారుల బదిలీతో అది మరుగున పడిపోయింది.
- ఇందిరానగర్, టెలికామ్‌నగర్‌లో కూడా ఎఫ్‌ఓబీ తలపెట్టినా అది స్థల పరిశీలనకే పరిమితం అయింది.
- అధికారులు వీటి ఏర్పాటుపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.






మందుల తయారీ, ప్యాకింగ్‌పై సందర్శకులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

ఆకట్టుకుంటున్న ఫార్మాలిటిక

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన ఫార్మాలిటిక– 2023 నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మూడురోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో 150కి పైగా కంపెనీలు 300లకు పైగా టాప్‌లైన్ బ్రాండ్‌లను ప్రదర్శనలో ఉంచారు. ఈ ఎక్స్‌పోలో నగర నలుమూలల నుంచి మెడికల్ నిర్వాహకులు, డాక్టర్లు వచ్చి సందర్శించి అధునాతన ఉత్పత్తుల గురించి స్టాల్స్‌లో తెలుసుకుంటున్నారు.

- ఇన్‌ఫార్మా మార్కెట్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్‌ముద్రాస్ మాట్లాడుతూ పూర్తిస్థాయి ఫార్మాస్యూటికల్ ఎకో సిస్టమ్, పరిశ్రమ వాటాదారులను ఒకేచోటకు చేరుస్తుందన్నారు.
- ప్రదర్శనలో మందుల తయారీ విధానం, ప్యాకింగ్, రవాణా విధానం తదితర అంశాలపై సందర్శకులకు స్టాల్స్ నిర్వాహకులు వివరిస్తున్నారు.
- ఉదయం 10గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.

దశలవారీగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి


శేరిలింగంపల్లి జెడ్పీ హెచ్ఎస్‌లో అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్, ఎంఈఓ వెంకటయ్య తదితరులు

శేరిలింగంపల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం 'మనబస్తీ–మనబడి' కార్యక్రమాన్ని చేపట్టిందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం శేరిలింగంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.78 లక్షలతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణానికి మండల విద్యాధికారి వెంకటయ్య, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అదనపు తరగతి గదుల నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. తరగతి గదులు, క్లాస్‌రూమ్‌లో డ్యూయల్ డెస్కులు, టాయిలెట్లు, మంచినీటి సౌకర్యం, వంటగదులు, భోజనశాల ప్రహరీగోడలు వంటి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. శేరిలింగంపల్లి మండలంలో 24 పాఠశాలలు, కూకట్‌పల్లి మండలంలో 7 పాఠశాలల్లో మొదటి విడత ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీఎస్ ఈడబ్ల్యూడీసీ ఏఈ శ్యామ్, నాయకులు హబీబ్, మహ్మద్ అహ్మద్, గోపాల్‌యాదవ్, రవియాదవ్ లక్ష్మణ్‌యాదవ్, రవి, శ్రీనివాస్,సాయి, ఉపాధ్యాయులు శంకర్, బలరామ్, బల్వంత్‌రెడ్డి, కరుణ పాల్గొన్నారు.

మాదాపూర్ ఓల్డ్ విలేజ్‌లో..

మాదాపూర్: కొండాపూర్ డివిజన్ మాదాపూర్ ఓల్డ్ విలేజ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ నీలం రవీందర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్, కిష్టారెడ్డిపేట గ్రామాల్లో నిర్మిస్తున్న ఫంక్షన్ హాళ్లు, దాయర నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కేఎస్ఆర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న వరసిద్ధి వినాయక దేవాలయం శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్‌చైర్మన్ నరసింహగౌడ్, సర్పంచులు కృష్ణ, భాస్కర్‌గౌడ్, వైసీపీ సునీతాసత్యనారాయణ, నాయకులు రాజు, పంచాయతీరాజ్ శాఖ డీఈ సురేష్ పాల్గొన్నారు.

గౌడ సంక్షేమ సంఘం కార్యాలయం ప్రారంభం


పల్లె రవికుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

మియాపూర్ : గౌడ జాతి ఐక్యతకు యువత ముందుకు రావాలని తెలంగాణ రాష్ట్ర గీత పారిశ్రామిక సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. మియాపూర్ మదీనాగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన శేరిలింగంపల్లి గౌడ సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.అనంతరం పల్లె రవికుమార్‌గౌడ్‌ను శేరిలింగంపల్లి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గౌడ కులస్తుల జాబితా సిద్ధం చేయాలనుంటున్న సంఘం లక్ష్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, గౌడ హాస్టల్ చైర్మన్ లక్ష్మారావుగౌడ్, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, శేరిలింగంపల్లి నియోజకవర్గం సంఘం సభ్యులు పాల్గొన్నారు.

20 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ , బుధవారాల్లో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 20 మందిని పట్టుకున్నట్టు చెప్పారు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 19 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున, ఒకరికి రూ. 3 వేలు జరిమానా విధించారు.

వీఓఏలకు ఎమ్మెల్యే చేయూత

పటాన్‌చెరు: గ్రామస్థాయిలో మహిళా సంఘాల బలోపేతంలో కీలక భూమిక పోషిస్తున్న గ్రామైక్య సంఘం సహాయకులు (వీఓఏ)లకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేయూత అందించారు. నియోజకవర్గ పరిధిలోని జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీ, గ్రామాలలో పనిచేస్తున్న 200 మంది వీఓఏలకు రూ.6 లక్షలతో కొనుగోలు చేసిన రెండు జతల డ్రెస్‌లు, గుర్తింపు కార్డులను పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని కటికబస్తీలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులతో కలిసి కుమార్‌యాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు డ్రైనేజీ, తాగునీటి, రోడ్డు సమస్యలు ఉన్నాయని కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ శివకుమార్, సిబ్బంది కాలనీవాసులు పాల్గొన్నారు.

'గీతం' అధ్యాపకుడికి అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ ఐవీ సుబ్బారెడ్డి

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఐవీ సుబ్బారెడ్డిని 'ఏపీజే అబ్దుల్ కలాం లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్' అవార్డు వరించింది. బెంగళూరులోని సామాజిక, ఆర్థికాభివృద్ధి జాతీయ విద్యాసంస్థ ఇటీవల ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఈ అవార్డును అందజేసి సత్కరించినట్టు గీతం వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. దేశాభివృద్ధి, బోధన, పరిశోధన, పత్ర సమర్పణలో డాక్టర్ ఐవీ చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డును ఇచ్చినట్టు తెలిపారు. పురస్కారం అందుకున్న డాక్టర్ సుబ్బారెడ్డిని స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దత్తాత్రి నగేష, భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ విశ్వం అభినందించారు.

20 రోజులపాటు దశాబ్ది ఉత్సవాలు

- నేడు క్యాంపు కార్యాలయంలో జెండా ఆవిష్కరణ
- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 20 రోజులపాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం అమరవీరులకు నివాళులు అర్పిస్తూ ప్రారంభించే ఈ ఉత్సవాలు జూన్ 22న అమరవీరుల సంస్మరణ సభ, అమరవీరుల స్తూపం ఆవిష్కరణతో ముగుస్తాయన్నారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, పాటల పోటీలను నిర్వహి స్తామన్నారు. మనబస్తీ–మనబడి భవనాలను ప్రారంభోత్సవం చేస్తామన్నారు. ప్రత్యేకంగా హరితహారం చేపడుతామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తరహాలోనే పాలమూరు– రంగారెడ్డిని కూడా పూర్తి చేసి ఈ ప్రాంతానికి తాగు,సాగునీరు తీసుకురావటానికి సీఎం కృషి చేస్తున్నార న్నారు. డివిజన్ల వారీగా నిర్వహించే కార్యక్రమంలో కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, ఉద్యమకారులు, వార్డు, ఏరియా కమిటీ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులను ఈ ఉత్సవాలలో భాగస్వాములను చేస్తామన్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ
- ఎంఐజీ కాలనీలో బస్తీ దవాఖానా ప్రారంభం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ, చిత్రంలో జిల్లా వైద్యాధికారులు

శేరిలింగంపల్లి: పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి పరిధిలోని ఎంఐజీ కాలనీలో నూతనంగా బస్తీ దవాఖానాను ఆయన జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సృజన, కార్పొరేటర్ సింధూఆదర్శ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య,వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌గౌడ్, నాగమణి, ఆదర్శ్‌రెడ్డి, భాస్కర్‌ముదిరాజ్, తీలావత్, చిన్న, వెంకట్‌రావు, వెంకట్‌రెడ్డి, రాకేష్, రాణి, జ్యోతి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో అత్యవసర సహాయక బృందాలు


జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: వర్షాకాలంలో ప్రారంభం కానున్న నేపథ్యంలో అత్యవసర సమయంలో సేవలు అందించేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అత్యవసర సహాయక బృందాలను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గురువారం క్యాంపు కార్యాలయం ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు 24 గంటల పాటు సహాయక బృందాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు మురుగునీటి కాలువలు, నాలాలు పొంగకుండా చర్యలు చేపట్టామన్నారు. భారతీనగర్, రామచంద్రపురం, పటాన్‌చెరు డివిజన్ల పరిధిలో ఒక్కో బృందం పనిచేస్తుందన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మెట్టుకుమార్ యాదవ్, పుష్ప నగేష్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ ఆఫర్ అంటూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన వాట్సాప్ మెసేజ్‌లకు స్పందించిన ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు డబ్బు పోగొట్టుకున్నారు. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం..అమీన్‌పూర్ పరిధిలోని పీజీఆర్ ఎన్‌క్లేవ్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి మే 24వ తేదీన పార్ట్ టైం జాబ్ ఆఫర్ అంటూ ఓ మెసేజ్ వచ్చింది. దీంతో ఆ మహిళ తన వివరాలు నమోదు చేసి నగదు పెడుతూ ఇచ్చిన టాస్కలు పూర్తి చేసింది. చివరికి తాను పెట్టిన రూ.2.80లక్షలకు రెట్టింపు నగదు ఇవ్వాలని అడగగా స్పందన రాలేదు. దీంతో ఆ ఉద్యోగి తాను మోసపోయినట్టు గుర్తించి సైబర్‌క్రైమ్‌లో ఫిర్యాదు చేసి అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

- అమీన్‌పూర్ పరిధిలోని బంధంకొమ్ముకు చెందిన మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి మే 24వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం పేరిట ఓ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలు నమోదు చేసి అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా నగదు పెడుతూ, టాస్కలు చేస్తూ వచ్చాడు. చివరకు తాను పెట్టిన రూ.2.63 లక్షలకు రెట్టింపు ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



రోడ్డుపైనే చెత్త.. జనం బేజార్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీ నుంచి బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌నకు వచ్చే మార్గంలో రోడ్డు పక్కన చెత్త ఉండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్త వేయరాదని బోర్డులు ఉన్నా ఎవరూ పట్టించడంలేదు. దీంతో వాహనదారులకు నరకయాతన తప్పడం లేదు. సమస్య పరిష్కరించాలని జీహెచ్ఎంసీ అధికారులకు పలుమార్లు విన్నవించినా రోడ్డు భెల్ టౌన్‌షిప్ పరిధిలో ఉందని సమాధానం చెబుతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మార్తాండనగర్‌లో బీజేపీ నాయకుల పర్యటన



హఫీజ్‌పేట్ : కొండాపూర్ డివిజన్ మార్తాండనగర్‌లో గడప గడపకూ బీజేపీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రజాయాత్రలో భాగంగా రవికుమార్ ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ, బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిని ప్రజలకు వివరించారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలకు చేసిందేమీ లేదని, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి కూడా ఇవ్వలేదన్నారు. పరీక్షా ప్రశ్న పత్రాల లీకేజీ ఇలా అన్ని విధాలుగా నిరుద్యోగులను నట్టేట ముంచారన్నారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తానన్న ఊసే లేదన్నారు. ప్రజలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. యాత్రలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, నాయకులు అంజనేయులు, నరసయ్య, నీలం కృష్ణ, నవీన్ రెడ్డి, గణేష్, అనిల్, కార్తిక్, రాజు, చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.